ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

జల్లి ఫ్యాక్టరీ మూసేయించారు

కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నామంటూ గ్రామస్తుల ఆగ్రహం





దారికి అడ్డంగా తవ్వుతున్న గ్రామస్తులు

కుప్పం మండలం మిట్టపల్లె వద్ద జల్లి ఫ్యాక్టరీని మంగళవారం పరిసర గ్రామస్తులు అడ్డుకున్నారు. కాలుష్యం ఎగజిమ్ముతోందని బలవంతంగా మూసేయించారు. దీనిని వైసీపీ నాయకులు అక్రమంగా నడుపుతున్నారని ఆరోపించారు. దీనివల్ల దుమ్ము ధూళి వాయు శబ్ద కాలుష్యంతో తామంతా ఇబ్బంది పడుతున్నామని ఆగ్రహించారు. భూములు, పంటలు విషతుల్యమైపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చిపడుతున్న రాళ్ల వల్ల తమకు ప్రాణహాని కూడా ఉందని రగిలిపోయారు. ఫ్యాక్టరీని బలవంతంగా మూతవేయడమే కాక, అక్కడి రోడ్డుకు అడ్డంగా పొక్లయినర్‌తో తవ్వేశారు. అధికారులు స్పందించి ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

- కుప్పం రూరల్

టమోటా ధరలు తగ్గించేశారు

మండీ యజమానుల తీరుతో రైతులకు తీరని నష్టం

మండీ యజమానులే వ్యాపారులుగా మారారు. అంతా ఒక్కటై టమోటా ధరలను నియంత్రించారు. అంతటా ధరలు పెరుగుతున్నా.. పలమనేరు మార్కెట్ యార్డులో మాత్రం దీనికి భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. అధికారుల ఉదాసీనతతో ధరలు తగ్గించేసి టమోటా రైతులను తీవ్రంగా నష్టపరిచారు. ఇక్కడి మార్కెట్ ప్రతి రోజూ వందలాది మంది రైతులు టమోటాలను విక్రయించుకోవడానికి వస్తుంటారు. మార్కెట్‌లో టమోటాలకు మంచి ధర పలుకుతున్న వేళ అమాంతంగా వారం రోజుల నుంచి పలమనేరులో ధరలు పతనమయ్యాయి. దీనిపై రైతులకు అనుమానం వచ్చింది. దీంతో వారు కర్ణాటక రాష్ట్రంలోని వడ్డిపల్లి, కోలారు టమోటా మార్కెట్లలో టమోటా ధరలు విచారించారు. ఇక్కడికి అక్కడికి బాక్సుకు కనీసం రూ. 250 నుంచి రూ.300 వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఇక్కడి రైతులు కష్ట నష్టాలకు ఓర్చి వడ్డిపల్లి, కోలారు మార్కెట్లకు టమోటాలను తీసుకెళ్లి విక్రయించుకొంటున్నారు. ఈ విషయమై పలమనేరు మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవకుమార్‌ను విచారించగా.. ఈ ధరల తగ్గింపు విషయాన్ని ఎవరూ తమదృష్టికి తీసుకు రాలేదన్నారు. దీనిపై వెంటనే విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొంటామని తెలిపారు.

- పలమనేరు



పెరుగుతున్న టమోటా ధరలు

సోమల: టమోటా ధరలు రెండు రోజులుగా పెరుగుతున్నాయి. మంగళవారం 15కిలోల బాక్సు రూ.540కి చేరింది. సోమల మండలంలో ఏప్రిల్‌లో నాట్లు వేసిన తోటల నుంచి దిగుబడులు అధికంగా ఉంది. దీంతో స్థానిక మార్కెట్లకే కాకుండా కర్ణాటకలోని కోలారు, వడ్డిపల్లె, చింతామణి మార్కెట్లకూ టమోటాలను తరలిస్తున్నారు. అక్కడ 15కిలోల బాక్సు రూ.750కి చేరుకోవడంతో రైతులంతా తీసుకెళ్తున్నారు. టమోటాలకు డిమాండు ఉండడంతో కొందరు వ్యాపారులు పొలాల వద్దకు వచ్చి కొనుగోళ్లు చేపట్టారు.

ఏడాదిలోగా నీళ్లు ఇచ్చేలా..!

గత వైసీపీ ప్రభుత్వం అన్ని పనుల్లాగే హంద్రీనీవా ప్రాజెక్టునూ నిర్లక్ష్యం చేసింది. కనీసం కాలువ నిర్వహణ పనులూ చేపట్టలేదు. ఎన్నికలకు ముందు కుప్పంలో హంద్రీనీవా నీళ్లను ప్రారంభిస్తున్నట్లు స్టంట్ చేసిన అప్పటి సీఎం జగన్.. మరుసటి రోజు కాలువలో నీళ్లు లేక అభాసుపాలయ్యారు.

సీఎం హోదాలో ఇటీవల కుప్పంలో పర్యటించిన చంద్రబాబు.. బ్రాంచి కెనాల్‌ను పరిశీలించారు. అసంపూర్తి పనులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. తదనుగుణంగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా హంద్రీ నీవాపై ఇప్పటికే అధికారులతో సమీక్షించారు. ఈ వారంలో మరోసారి సమావేశం కానున్నారు. ఏడాదిలోగా హంద్రీ నీవా నీటిని కుప్పానికి తీసుకొచ్చే లక్ష్యంతో ఉన్నారు. - చిత్తూరు, ఆంధ్రజ్యోతి



హంద్రీనీవా కాలువ

కుప్పం బ్రాంచి కెనాల్ పెండింగ్ పనులపై సీఎం దృష్టి

హంద్రీ నీవా పెండింగు పనుల పూర్తికి ప్రణాళిక

మదనపల్లె, యామిగానిపల్లె రిజర్వాయర్లపైనా సానుకూలత



ఇటీవల కుప్పంలో పర్యటించినప్పుడు బ్రాంచి కెనాల్‌ను పరిశీలిస్తున్న సీఎం

హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు జిల్లాకు వరప్రదాయిని. ఇందులో భాగమైన కుప్పం బ్రాంచి కెనాల్‌ను 2014లో టీడీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రూ.575 కోట్లతో 123 కిలోమీటర్ల మేర కాలువ పూర్తయితే పలమనేరు, కుప్పం నియోజకవర్గాలోని 8 మండలాల్లోని 110 చెరువులకు నీరు అందుతుంది. వాటి పరిధిలోని 6300 ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలయం అవుతుంది. భూగర్భ జలమట్టం పెరిగి అన్నదాతలకు ఇక్కట్లు తప్పుతాయని చంద్రబాబు భావించి పనులు వేగంగా చేయించారు. దీంతో 2014-19 మధ్యకాలంలో 90శాతం పనులు పూర్తి చేయించారు. 121 కిలోమీటర్ల మేర కాలువ తవ్వించగా.. కేవలం 2.2 కిలోమీటర్ల కాలువ మాత్రమే పెండింగులో ఉంది. రూ.490 కోట్ల విలువైన పనులు చేశారు. 2019 జనవరిలో వి.కోట మండలం కృష్ణాపురానికి కృష్ణా జలాలను తెచ్చారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ.. ఈ ఐదేళ్లలో పెండింగ్ పనులు పూర్తిచేసి కుప్పానికి నీళ్లను ఇవ్వలేకపోయింది.

పెండింగ్ పనుల పూర్తికి ప్రతిపాదనలు

బి.కొత్తకోట నుంచి మదనపల్లె వరకు కృష్ణాజలాలు పారేందుకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. కాలువకు 25 చోట్ల గండ్లు పడడంతో పాటు లీకేజీలు ఏర్పడ్డాయి. బి.కొత్తకోట నుంచి మదనపల్లె మధ్య 64వ కిలోమీటరు నుంచి 83వ కిలోమీటరు వరకున్న పెండింగ్ పనులతో పాటు కాలువ వెడల్పు, లీకేజీలున్న చోట లైనింగ్ పనులకు రూ.177 కోట్లు కావాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనికి ప్రభుత్వం అంగీకరించినట్లు సమాచారం. ఇక ప్రధాన కాలువ విషయానికొస్తే ఉమ్మడి జిల్లా కేవీపల్లె మండలంలోని అడవిపల్లె రిజర్వాయర్ వద్ద ముగుస్తుంది. అసంపూర్తిగా ఉన్న ప్రధాన కాలువ పనులకు రూ.వంద కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇక కుప్పం బ్రాంచి కెనాల్‌లో పెండింగులో ఉన్న చిన్నపాటి స్ట్రక్చర్లను పూర్తి చేసేందుకు రూ.16 కోట్ల వరకు ఖర్చవుతుందని భావిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో కాలువను పరిశీలించి ప్రతిపాదనల్ని సిద్ధం చేశారు. ఏడాదిలోగా కుప్పానికి నీళ్లను తెస్తామని సీఎం చంద్రబాబు ఇటీవల పర్యటనలో చెప్పిన విషయం తెలిసిందే. వీలైతే ఈ ఏడాది నవంబరు, డిసెంబరులోనే కుప్పానికి నీళ్లను తెచ్చే అవకాశాలున్నట్లు అధికారులు భావిస్తున్నారు.

రిజర్వాయర్లపైనా..

శాంతిపురం మండలం మాదనపల్లెలో 0.35 టీఎంసీలు, గుడుపల్లె మండలం యామిగానిపల్లెలో 0.71 టీఎంసీల సామర్థ్యంతో రెండు రిజర్వాయర్లను నిర్మించేందుకు కూడా సీఎం చంద్రబాబు అనుకూలంగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు రిజర్వాయర్ల నిర్మాణానికి రూ.535 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ పనులను ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయంపై స్పష్టత లేకున్నా.. ఈ ఐదేళ్లలో పూర్తయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

కాలువ సాగేదిలా..

అనంతపురం జిల్లా ముదిగుబ్బ సమీపంలోని బొంతపల్లె వద్ద హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి పుంగనూరు బ్రాంచి కాలువ ప్రారంభమవుతుంది. అక్కడ్నుంచి ఉమ్మడి జిల్లాలోని పీటీఎం మండలంలోకి ప్రవేశిస్తుంది. మదనపల్లె మీదుగా పుంగనూరు వరకు వస్తుంది. అక్కడి నుంచి కుప్పం బ్రాంచి కాలువ ప్రారంభమై.. పలమనేరు మీదుగా వి.కోట, శాంతిపురం, కుప్పం వరకు చేరుతుంది.

కడా పీడీగా వికాస్ మర్మత్



కుప్పం, జూలై 9: కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ప్రాజెక్టు డైరెక్టరుగా వికాస్ మర్మత్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనరుగా ఉన్న మర్మత్‌ను రిలీవ్ చేసి, కడా పీడీగా నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఏడాది క్రితం రాష్ట్ర సచివాలయాల విభాగం నుంచి నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్‌గా వచ్చిన ఆయన.. ప్రస్తుతం కడా పీడీగా బదిలీపై కుప్పానికి వస్తున్నారు. కుప్పం నియోజకవర్గం అభివృద్ధి కోసం కడా ఏర్పాటు చేస్తామని ఇటీవల పర్యటన సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఈ నియామకం జరిగింది. కాగా, 2014లో టీడీపీ హయాంలో కడా కొనసాగింది. 2019లో ఎన్నికల ముందు కడా స్థానంలో పి.కె.ఎం.ఉడా (పలనేమరు, కుప్పం, మదనపల్లె ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ) ఏర్పాటు అయింది. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అటు కడా కానీ, ఇటు పి.కె.ఎం.ఉడా కానీ మనుగడలో లేకుండా పోయాయి. మళ్లీ ఇన్నాళ్లకు కడా ఏర్పాటు చేయడమే కాకుండా, ఒక ఐఏఎస్ అధికారిని ప్రాజెక్టు డైరెక్టరుగా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో కుప్పం అభివృద్ధి మరింత వేగంగా పరుగులు తీసేందుకు అవకాశం ఏర్పడింది.

11 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 9: జిల్లాలోని 11 మండలాల్లో గడచిన 24 గంటల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాల వారీగా పెనుమూరులో 19.8, వెదురుకుప్పంలో 10.4, కార్వేటినగరంలో 9.8, పెద్దపంజాణిలో 9.2, పూతలపట్టులో 6.2, శ్రీరంగరాజపురంలో 6.0, పులిచెర్లలో 4.0, చిత్తూరు అర్బన్‌లో 3.4, పుంగనూరులో 3.2, పాలసముద్రంలో 3.2, తవణంపల్లెలో 2.8 మి.మీ. వర్షపాతం నమోదయింది.

మరో రెండు ఇసుక డిపోలు ప్రారంభం



ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్



ఇసుక స్టాక్‌పాయింట్ (డిపో) వద్ద అధికారుల పూజలు

గంగవరం, జూలై 9: ఉచిత ఇసుక కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మరో రెండు ఇసుక డిపోలను మంగళవారం ప్రారంభించారు. గంగవరం మండలం గండ్రాజుపల్లె, చిత్తూరు రూరల్ మండలం దిగువమాసాపల్లి స్టాక్ పాయింట్లు ప్రారంభమయ్యాయి. తొలిరోజైన సోమవారం చిత్తూరు రూరల్ మండలం పాలూరు వద్ద ఇసుక డిపోను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇసుక ఉచితమైనా, రేవు నుంచి స్టాక్ పాయింట్ వరకు రవాణా చార్జీలు, లోడింగ్ కూలీల ఖర్చు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఖర్చుల కింద గండ్రాజుపల్లె స్టాక్ పాయింట్ వద్ద ట్రాక్టరు ఇసుకకు రూ.వెయ్యి ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందని డిప్యూటీ తహసీల్దారు ప్రసన్నకుమార్ తెలిపారు. మంగళవారం గండ్రాజుపల్లె సమీపంలోని ఇసుక స్టాక్ పాయింట్‌కు పూజలు చేసి పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. ఇసుక కావలసిన లబ్ధిదారులు ఇసుక డిపో (స్టాక్‌పాయింట్)కు వచ్చి ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్, వాహనం నెంబరును నమోదు చేసుకోవాలన్నారు. ఇలా నమోదు చేసుకున్న తర్వాత క్యూఆర్ కోడ్ ద్వారా నగదు చెల్లించాలన్నారు. ఒక లబ్ధిదారుడికి రోజుకు ఒక ట్రాక్టర్ ఇసుక (4 టన్నులు) ఇస్తామన్నారు. ఇలా ఒకరికి నాలుగు ట్రాక్టర్ల ఇసుక మాత్రమే ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇసుక స్టాక్‌ను బట్టి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికే పంపిణీ చేస్తామన్నారు. ఎవరైనా అంతకుమించి డబ్బు డిమాండు చేస్తే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, అలాంటి వారిపై ఖచ్చితంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పకడ్బందీగా ఉచిత ఇసుక విధానం అమలు

చిత్తూరు రూరల్, జూలై 9: నూతన ఇసుక విధానాన్ని అత్యంత పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం చిత్తూరు రూరల్ దిగువమాసాపల్లి స్టాక్‌పాయింట్‌ను ఆయన తనిఖీ చేశారు. వినియోగదారులతో మాట్లాడి. వారి సమస్యలను తెలుసుకున్నారు. యూపీఐ ద్వారా మాత్రమే నగదు చెల్లించాలని వినియోగదారులకు సూచించారు. ప్రతి చెల్లింపునకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకే ఇసుక అమ్మకాలు జరపాలన్నారు. వినియోగదారుల నుంచి ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్, వాహన నంబర్, డెలివరీ అడ్రస్ తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇక ఇసుక కష్టాలకు స్వస్తి: గురజాల

చిత్తూరు రూరల్: సీఎం చంద్రబాబు ఇసుక ఉచితంగా అందించి ఈ రంగంలో కష్టాలకు స్వస్తి పలికారని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. మంగళవారం చిత్తూరు రూరల్ మండలం దిగువమాసాపల్లి వద్ద ఇసుక స్టాక్ పాయింట్‌ను ఆయన ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటను నెరవేరుస్తుందన్నారు. ఇసుకను పారదర్శకంగా అందించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మంజూష్, మాజీ సర్పంచ్ జగదీష్‌నాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇసుక డంప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గురజాల



స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

పాలిటెక్నిక్ ప్రవేశాలకు చివరి అవకాశం

పలమనేరు, జూలై 9: పాలిటెక్నిక్ ప్రవేశాలకు చివరి విడత ప్రకటన వెలువడినట్లు పలమనేరు మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ మొహమ్మద్ మంగళవారం తెలిపారు. ఇదివరకే ప్రవేశాలు పొందిన విద్యార్థులు.. ఇంకనూ ప్రవేశాలు పొందని వారూ ఇప్పుడు తిరిగి వెబ్ ఆప్షన్‌ను నమోదు చేసుకొని సీట్లు పొందే అవకాశం ఉందన్నారు. ఇంకా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసుకోనివారు ప్రాసెసింగ్‌ఫీజు చెల్లించి ఈనెల 11 నుంచి 13వ తేదిలోగా తమ సర్టిఫికెట్లను పరిశీలించుకోవాలని సూచించారు. 11 నుంచి 14వ తేది వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చన్నారు. సీట్ల కేటాయింపునకు సంబంధించి 16వ తేదీన సమాచారం వస్తుందన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు తమ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈనెల 18 నుంచి 20వ తేదీలోగా చేరాల్సి ఉంటుందన్నారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్లను చిత్తూరు జిల్లా పరిసర ప్రాంతాల వారు తిరుపతిలోని ఎస్.వి. గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో చేసుకోవాలన్నారు. పలమనేరు పాలిటెక్నిక్‌లోని అన్ని విభాగాల్లోను సీట్లు మిగిలి ఉన్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకోసం 94414 83742 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

మామపై కోడలి దాడి


గాయపడ్డ రెడ్డప్ప

చౌడేపల్లె, జూలై 9: మామపై కోడలు కొడవలితో దాడి చేసిన సంఘటన చౌడేపల్లె మండలంలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. కాగతి పంచాయతీ పలగార్లపల్లెకు చెందిన రెడ్డెప్ప(70), పార్వతమ్మ దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరి కుమారుడు గంగాధర్‌కు 14 ఏళ్ల క్రితం ఉమాదేవితో వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒకటిన్నర ఏడాది కిందట కుటుంబ కలహాలతో గంగాధర్ ఆత్మహత్య చేసుకున్నారు. పక్క ఇంటిలో తన పిల్లలతో విడిగా ఉమాదేవి ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి రెడ్డెప్ప తన మనవళ్లకు స్నాక్స్ ఏమైనా తీసుకోమని చెరో వంద రూపాయలు ఇచ్చారు. తన పిల్లలకు ఎప్పుడు వందలు వందలు ఇస్తే ఎలాగని అత్త, మామలతో ఉమాదేవి గొడవ పడింది. ఈ గొడవ పెద్దదై సమీపంలో కొడవలితో మామపై దాడి చేసింది. ఈ దాడిలో ఆయన తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే కుటుంబీకులు ఆయన్ను పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించి చేయించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండండి


వైద్యశిబిరాన్ని సందర్శిస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

వి.కోట, జూలై 9: జిల్లా వ్యాప్తంగా ప్రజలు జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతిదేవి అన్నారు. మంగళవారం వి.కోట మండలం తోటకనుమ గ్రామంలో జ్వర మరణాలపై ఆమె ఆరా తీశారు. ఉదయాన్నే గ్రామానికి చేరుకున్న ఆమె జ్వరాలకు గత కారణాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాలుగు రోజుల క్రితం డెంగ్యూ జ్వరంతో మృతి చెందిన స్వాతి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఇతర డెంగ్యూ జ్వర బాధితుల ఆరోగ్య పరిస్థితిపై విచారించారు. తోటకనుమతో పాటు పోతనపల్లెలోను వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యులు ఆమె దృష్టికి తెచ్చారు. మురుగునీటి కాలువలను క్రమం తప్పకుండా శుభ్రపరచాలని, క్లోరినేషన్ చేయించి కాచి వడబోసిన నీటిని తాగాలని ప్రజలకు సూచించారు. ఓవర్ హెడ్ ట్యాంకులను నీటిని నింపిన ప్రతిసారి క్లోరినేషన్ చేయించాలన్నారు. చీకటి పడిన తర్వాత ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వర కేసులపై ఆరా తీశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రతి జ్వరం కేసు సమాచారాన్ని సేకరించాలన్నారు. వారిలో కిట్ మెథడ్‌లో పాజిటివ్ వచ్చిన కేసుల నమూనాలను సేకరించి డెంగ్యూ నిర్ధారణ పరీక్ష (ఎలీసా) నిమిత్తం సమీపంలోని ఏరియా ఆస్పత్రులకు పంపాలని ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీవో గోవర్ధన్, వైద్యాధికారులు విజయ్‌కాంత్, మాధవి. అసిస్టెంట్ మలేరియాధికారి రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పారిపోయిన బాలికల అప్పగింత

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చెప్పకుండా వచ్చేసి రైల్వే ట్రాక్‌పై అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించిన బాలికలను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన రేణిగుంట మండలంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నైలో ఇరుగుపొరుగు కుటుంబాలకు చెందిన ఇద్దరు బాలికలు భవన నిర్మాణ పనులకు కూలీలుగా వెళుతుంటారు. అదే పనుల్లో పరిచయమైన ఓ యువకుడితో కలసి ముగ్గురూ మంగళవారం చెన్నై నుంచి రైలులో రేణిగుంట బయల్దేరారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో రైలు రేణిగుంట అవుటర్ సిగ్నల్ వద్ద ఆగడంతో ముగ్గురూ అక్కడ కిందకు దిగేశారు. రైలు వెళ్లిపోయాక ట్రాక్‌పై నడిచి వెళుతుండగా చూసిన కొందరు అనుమానంతో డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. గాజులమండ్యం పోలీసులు వెళ్లేసరికి యువకుడు పరారయ్యాడు. బాలికలను పోలీసు స్టేషన్‌కు తరలించిన పోలీసులు విచారించి వివరాలు రాబట్టారు. ఇళ్లలో చెప్పకుండా వచ్చేసినట్టు తెలియడంతో వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి నిర్ధారించుకున్నారు. పరారైన యువకుడి గురించి ఆరా తీయగా తమకు తెలిసిన వ్యక్తేనని బాలికలు చెప్పారు. ఎస్పీ ఆదేశాలతో మహిళా హెడ్ కానిస్టేబుల్‌ను రక్షణగా పెట్టి చెన్నైకి పంపించారు. ఓ బాలిక తల్లిదండ్రులు అందుబాటులో లేకపోవడంతో మరో బాలిక తల్లిదండ్రులకు ఇద్దరినీ అప్పగించారు. కాగా ఈ ఘటనకు సంబంధించి రేణిగుంట అవుటర్ సిగ్నల్ వద్ద రైలు దిగిన బాలికలపై గంజాయి మత్తులో ఉన్న ముగ్గురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారని, వెంట ఉన్న యువకుడిపై కూడా దాడి చేశారని ప్రచారం జరిగింది. ఈ విషయమై ఎస్పీ హర్షవర్ధన్ రాజును వివరణ కోరగా.. బాలికలపై అత్యాచారం జరిగిందన్నది తప్పుడు ప్రచారమని ఖండించారు. ఇళ్లలో చెప్పకుండా వచ్చిన బాలికలను క్షేమంగా వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని స్పష్టం చేశారు.

తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ

320గ్రాముల బంగారం, 900 గ్రాముల వెండి ఆభరణాలు

రూ.3.50లక్షల అపహరణ


చిందరవందరగా ఉన్న బీరువా - వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

శ్రీకాళహస్తి, జూలై 9: శ్రీకాళహస్తి పట్టణం దక్షిణకైలాస్ నగర్ కాలనీలోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి భారీ చోరీ జరిగింది. టూటౌన్ సీఐ రారాజు కథనం మేరకు.... పట్టణానికి చెందిన సిరాజ్ ఉన్నీసా తన కుమారుడితో కలిసి దక్షిణకైలాస్ నగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివసిస్తోంది. ఆమె కుమార్తె, అల్లుడు చెన్నైలో ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవల కూతురు, అల్లుడు తమిళనాడులోని వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయ్యారు. దీంతో సిరాజ్ ఉన్నీసా బంగారు ఆభరణాలను శ్రీకాళహస్తిలోని తన తల్లి వద్ద భద్రపరిచింది. ఆదివారం సిరాజ్ ఉన్నీసా కొడుకుతో కలిసి చెన్నైలోని కుమార్తె ఇంటికి వెళ్లింది. సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు తలుపులు పగులగొట్టి ఆమె ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలోని 40 సవర్లు(320) గ్రాముల బంగారు ఆభరణాలు, 900 గ్రాముల వెండి వస్తువులు, రూ.3.50లక్షల నగదు దోచుకెళ్లారు. మంగళవారం ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని పొరుగింటివారు గమనించి చెన్నైలో ఉన్న సిరాజ్ ఉన్నీసాకు సమాచారం అందించారు. ఆమె కొడుకుతో పాటు శ్రీకాళహస్తికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రారాజు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. తిరుపతి నుంచి క్లూస్‌టీం బృందం వచ్చి వేలిముద్రల నమూనాలను సేకరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు చోరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డయేరియాతో ఇద్దరు దివ్యాంగుల మృతి

రుయాలో చికిత్స పొందుతున్న 16మంది -పాస్ మనోవికాస్ కేంద్ర నిర్వాహకుల అలక్ష్యం - విచారణకు తిరుపతి కలెక్టర్ ఆదేశం


శేషాచలం మృతదేహం - స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రదీప్


పాస్ మనో వికాస్‌కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్/వైద్యం), జూలై 9 : వారంతా మానసిక దివ్యాంగులు. తిన్న ఆహారం సరిపడక వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆస్పత్రికి తరలించకుండా అందుబాటులో వున్న ఆయుర్వేద డాక్టరుతో వైద్యసేవలందించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఒకరు, సోమవారం మరొకరు చనిపోయారు.వివరాల్లోకి వెళితే....తిరుపతి రూరల్ మండ లం పద్మావతిపురంలోని పాస్ మనోవికాస్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలలో బాల బాలికలతోపాటు 30 ఏళ్ల వయస్సు పైబడిన మానసిక వ్యాధిగ్రస్తులు, అనాథలు కలిపి 72 మంది ఆశ్రయం పొందుతున్నారు. వీరిలో 22మంది అనాథలు కాగా మరో 52మంది మానసిక వ్యాధులతో బాధపడే దివ్యాంగులు ఉన్నారు. వీరికి ఆదివారం సాయంత్రం ఆశ్రమ నిర్వాహకులు బోండాలు, సాంబారు కలిపి ఆహారం పెట్టారు. సోమవారం తెల్లవారుజామున కొందరికి వాంతులు, విరోచనాలు కావడంతో ఆశ్రమంలో ఉన్న ఆయుర్వేద డాక్టరు మందులు ఇచ్చారు.వాంతులు, విరోచనాలు ఆగకపోగా గణపతి(30) అనే వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో అతడిని సోమవారం ఉదయం రుయాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి గణపతి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో గణపతికి అయిన వారు ఎవరూ లేకపోవడంతో ఆశ్రమ పాఠశాల నిర్వాహకులే గణపతి మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం ఖననం చేశారు. ఆశ్రమంలో ఉన్న మరి కొందరికి కూడా వాంతులు, విరోచనాలు అవుతుండడంతో ఆశ్రమ నిర్వాహకులు అందుబాటులో ఉన్న ఆయుర్వేద వైద్యుడితో చికిత్స అందించారు. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురైన మరో అనాథ బాలుడు శేషాచలం(16) డయేరియా లక్షణాలతో మంగళవారం ఉదయం మృతిచెందాడు.ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, డీపీవో సుశీలాదేవి, డీఎంహెచ్‌వో శ్రీహరి పాస్ మనోవికాస్ కేంద్రానికి చేరుకుని డయేరియా లక్షణాలతో బాధపడుతున్న కొంతమందిని ఆస్పత్రికి తరలించారు. మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటు చేశారు. రుయాలో 16మంది చికిత్స పొందుతుండగా వారిలో ప్రదీప్(20), తేజస్విని(25) అనే ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం స్విమ్స్‌కు తరలించారు.పాస్ మనోవికాస్ కేంద్రంలో అసలేం జరిగిందనే విషయంపై కలెక్టర్ వెంకటేశ్వర్ విచారణకు ఆదేశించారు.దీంతో అక్కడ ఆహార పదార్థాలను, తాగు నీటిని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపారు.తాగు నీరు కలుషితం కాలేదని మంగళవారం రాత్రికి కలెక్టర్‌కు నివేదిక అందింది. కాగా కలెక్టర్ వెంకటేశ్వర్ రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న మానసిక దివ్యాంగులను పరామర్శించారు.అలాగే పాస్‌మనోవికాస్ మానసిక దివ్యాంగుల ఆశ్రమాన్ని సందర్శించారు.ఇంతమంది తీవ్ర అస్వస్థతకు గురైనా జిల్లా యంత్రాంగానికి తెలియకుండా ఎందుకు వుంచారంటూ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమంలోని వంటగదిని, తాగునీటిని పరిశీలించాక దీనిపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 16మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని,వారి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.శనివారం బోండాలు తినడం వలనే తీవ్ర అస్వస్థతకు గురైనట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేసి శేషాచలం మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు.

పరిశ్రమల ఏర్పాటుకు తరలిరండి

ఎంఎస్ఎంఈలకు కోసలనగరం అనుకూలం ● చెన్నైలో పారిశ్రామికవేత్తలతో నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ భేటీ


అంబత్తూరు ఇండస్ట్రియల్ మానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్‌తో సమావేశం నిర్వహిస్తున్న గాలి భానుప్రకాష్

నగరి, జూలై 9: సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు విజయపురం మండలం కోసలనగరం అనుకూల ప్రదేశమని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. మంగళవారం చెన్నైలో అంబత్తూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ మానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్‌తో ఆయన సమావేశమయ్యారు. ఏపీలో చంద్రబాబునాయుడు సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని చెప్పారు. తయారీ రంగ పరిశ్రమలను ప్రత్యేకించి సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు నూతన పాలసీని తీసుకురానున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో విరివిగా ఉద్యోగాలను కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. చంద్రబాబు స్ఫూర్తితో నగరి నియోజకవర్గంలోనూ పరిశ్రమలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రకటించారు. తన తండ్రి, మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు హయాంలో విజయపురం మండలంలోని కోసలనగరం వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ఏపీఐఐసీ ద్వారా 1579 ఎకరాలను సేకరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అంబత్తూరులో పరిశ్రమల విస్తరణకు స్థలాభావ సమస్య ఉన్న నేపథ్యంలో చెన్నైకు సమీపంలోని కోసలనగరంలో పరిశ్రమల ఏర్పాటుకు భూమి సిద్ధంగా ఉందన్నారు. మౌలిక సౌకర్యాల కల్పనకు తమ ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు. కష్టించి పనిచేసే యువత నగరి నియోజకవర్గంలో ఉన్నారని వివరించారు. అనంతరం కోసలనగరం ఇండస్ట్రియల్ పార్కుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను సన్మానించారు. అంబత్తూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుఫాక్చర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఏఎస్ హరిప్రసాద్‌తో పాటు అధ్యక్షుడు అరవింద్, సీనియర్ సభ్యుడు రమేష్ తదితరులతో ఎమ్మెల్యే చర్చించారు. ఈ సమావేశంలో మాధవనాయుడు, లక్ష్మీపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద తయారీని ఆధునికీకరించండి

సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు ఇన్‌హౌస్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయండి

టీటీడీకి పాకశాస్త్ర నిపుణుల సూచన

తిరుమల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు మరింత రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడానికి అన్నప్రసాద తయారీ విధానాన్ని ఆధునికీకరించాలని ప్రఖ్యాత పాకశాస్త్ర నిపుణులు టీటీడీకి సూచించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో మంగళవారం సాయంత్రం టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, దక్షిణ భారతదేశ చెఫ్స్ అసోసియేషన్ బృందంతో కలిసి అన్నప్రసాదం, వంటశాలల ఆధునికీకరణ తదితర అంశాలపై టీటీడీ ఈవో శ్యామలరావు సుదీర్ఘంగా చర్చించారు. అంతకు ముందు తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద కేంద్రాన్ని సందర్శించిన చెఫ్స్ బృందం అన్నప్రసాదాలు వడ్డించడం, నిల్వ చేయడం, శుభ్రపరచడం తదితర కార్యకలాపాలను పరిశీలించింది.రోజురోజుకూ పెరుగుతున్న అసంఖ్యాక భక్తుల అవసరాలకు అనుగుణంగా వంటశాలలను ఆధునికీకరించాలని సూచించింది.అన్నప్రసాద భవన సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ద్వారా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం, ఇన్‌హౌస్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి తనిఖీ చేయడం, ఆహార పదార్థాల పరిశుభ్రత, వ్యర్థ పదార్థాల నిర్వహణ, పరికరాల యాంత్రీకరణ, ఆహారాన్ని రుచికరంగా, వేగవంతమైన పద్ధతిలో తయారు చేయడం, మూడు నెలలకోసారి ఫుడ్ అనలిస్ట్‌లతో సూచనలు తీసుకోవడం వంటి అనేక సూచనలు చేశారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లపై పక్కా ప్రణాళికను రూపొందించి మరోసారి అన్నప్రసాద కార్యకలాపాలపై ఆహార నిపుణులతో త్వరలో సమావేశం నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు. జీఆర్‌టీ గ్రూప్ ఆఫ్ హోటల్స్ సీఈవో విజయ్ విక్రమ్ కోటా, సౌతిండియా చెఫ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ దామోదరన్, చెఫ్ తిరులోక్‌చందర్,తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ హెడ్ చెఫ్ సీతారామ్ ప్రసాద్, కిచెన్ కన్సల్టెంట్స్, డిజైనర్ రితేష్ చౌదరి, దీపక్, నితీష్, టీటీడీ డిప్యూటీఈవో రాజేంద్ర, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఇద్దరు కిడ్నాపర్లు

శ్రీకాళహస్తి, జూలై 9: ఎన్ఆర్ఐను కిడ్నాప్ చేసిన కేసులో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్ వద్ద తిరుపతికి చెందిన ఎన్ఆర్ఐ హరికృష్ణను కొందరు కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. సోమవారం రాత్రి ఆయన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తిరుపతికి చెందిన ఇద్దరు కిడ్నాపర్లను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇందులో పాత్రధారులైన మరికొందరి కోసం గాలింపు కొనసాగిస్తున్నారు.

గంజాయి మత్తులో యువకుల వీరంగం

● నారాయణ విద్యాసంస్థల బస్సుపై మంగళంలో రాళ్లతో దాడి



ధ్వంసమైన బస్సు అద్దం - వీరంగం సృష్టించిన యువకులు

మంగళం, జూలై 9: గంజాయి మత్తులో ఇద్దరు యవకులు మంగళవారం సాయంత్రం నారాయణ విద్యాసంస్థకు చెందిన బస్సుపై మంగళంలో రాళ్లతో దాడి చేసి అద్దాలను పగులగొట్టారు. స్థానికులు, తిరుచానూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నారాయణ విద్యాసంస్థలకు చెందిన బస్సు 25 మంది విద్యార్థినులతో బయల్దేరింది. మంగళం బీటీఆర్ కాలనీ 16వ లైను వద్దకొచ్చేసరికి స్థానిక యువకులు బాలుప్రకాష్, మహేష్ అడ్డుగా నిలవడంతో డ్రైవర్ కుమార్ హారన్ కొట్టాడు. గంజాయి మత్తులో ఉన్న ఆ యువకులు అక్కడున్న రాళ్లను తీసుకుని బస్సు అద్దాలను పగులగొట్టారు. వాహనంలోని బాలికలు భయభ్రాంతులకు గురై కేకలు పెట్టారు. మరోవైపు డ్రైవర్ కుమార్‌ను కిందకు లాగి.. దుస్తులు చిరిగేలా కొట్టారు. అలాగే ఆ మార్గంలో వెళ్లే వాహనాలపైనా ఇలాగే దాడి చేస్తూ ఇబ్బందులు కల్గించారు. సమాచారం అందుకున్న మంగళం అవుట్ పోస్టు పోలీసులు అక్కడికి చేరుకుని, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. బస్సులో ఉన్న విద్యార్థినులను వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి వెంటపంపించారు. వీరంగం సృష్టించిన యువకులను, దాడికి గురైన బస్సును తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీతో ఆదాయం పెంపు


మాంస ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తున్న డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్, జూలై 9: విలువ ఆధారిత మాంస ఉత్పత్తుల తయారీద్వారా ఆదాయాన్ని మరింతగా పెంచుకోవచ్చని ఎస్వీవెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య పేర్కొన్నారు. ఎస్వీవెటర్నరీ వర్సిటీలోని వెటర్నరీ కళాశాలలో పశు ఉత్పత్తుల సాంకేతిక శాస్త్రవిభాగం(ఎల్‌పీటీ) ఆధ్వర్యంలో ఐసీఏఆర్ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో గ్రామీణ మహిళలకు విలువ చేకూరిత మాంస ఉత్పత్తుల తయారీలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడంపై మంగళవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వర్సిటీ డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్యతో జగపతిరామయ్య కలసి శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. ఉత్పత్తుల తయారీలో పాటించాల్సిన ప్రమాణాలు, మార్కెటింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వీరికి విభాగ హెడ్ డాక్టర్ జి.విజయభాస్కర్ రెడ్డి నేతృత్వంలో శిక్షణ నిర్వహించారు. ఇందులో భాగంగా చికెన్ కట్‌లెట్స్, నగ్గెట్స్, సమోసాలు, చికెన్ ఇడ్లీలు, చికెన్ సూప్, మాంసపు సాజేసులుఖైమా ఉండలు, వడల తయారీ పద్ధతులపై మహిళలకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. శిక్షణలో పాల్గొన్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అధ్యాపకులు డాక్టర్ సుధీర్, డాక్టర్ జడ్ నవీన్, స్వయంసహాయక సంఘాల మహిళా సభ్యులు హాజరయ్యారు.

ఏటీఎంలో కార్డు మార్చి రూ.40 వేల టోకరా

పాకాల, జూలై 9: స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో మంగళవారం సాయంత్రం డబ్బు డ్రా చేయడానికి వెళ్లిన వ్యక్తిని బురిడీ కొట్టించి ఏటీఎం కార్డు మార్చి రూ.40 వేలు కాజేశారు. బాధితుడి కథనం మేరకు ఇరంగారిపల్లె పంచాయతీ ముద్దలపల్లెకు చెందిన బి.కస్తూరి బాబు చీటీ కట్టాలని తిరుపతిలో వున్న కుమారుడిని రూ.ఏడు వేలు డబ్బులు అడిగాడు. ఇంట్లో వున్న ఏటీఎం కార్డు ద్వారా డ్రా చేసుకోవాలని కుమారుడు చెప్పాడు. భార్యతో కలిసి కస్తూరి బాబు ఆర్టీసీ బస్టాండు ఎదుట వున్న ఎస్‌బీఐ ఏటీఎంకు వెళ్లి డ్రా చేసుకోవడానికి ప్రయత్నించాడు. ఏటీఎం పనిచేయలేదు. ఇదంతా గమనిస్తున్న సుమారు 50 ఏళ్ల వయసున్న వ్యక్తి ఇదే కేంద్రంలో వున్న మరో మిషన్‌లో ట్రై చేస్తానని కార్డు తీసుకున్నాడు. ఈ మిషన్‌లోనూ డబ్బు రాలేదని మరో కార్డు వీరి చేతికిచ్చి ఒరిజినల్ నొక్కేశాడు. రేపు తీసుకుందామని ఇంటికెళ్లిన కాసేపటికే రూ.40 వేలు డ్రా అయినట్లు కుమారుడికి మెసేజ్ వెళ్లింది. దీంతో తండ్రిని ఏడు వేలు డ్రా చేసుకోమంటే రూ.40 వేలు తీసుకున్నావని కుమారుడు ప్రశ్నించాడు. అసలు నేను డబ్బులే డ్రా చేయలేదని చెప్పడంతో కార్డు చూసి మోసపోయామని గ్రహించారు. ఒరిజినల్ కార్డు స్థానంలో ఖాదం వెంకటరమణరావు పేరుతో కార్డు ఉండటంతో మోసపోయామని లబోదిబోమంటూ బాధితుడు పోలీస్ స్టేషన్‌కు పరుగులు తీశాడు.

శేషాచల అడవుల్లోకి

స్మగ్లర్ల చొరబాటు

అడ్డుకున్న పోలీసులు.. ఇద్దరి అరెస్టు

కారు, రంపాలు, గొడ్డళ్లు స్వాధీనం


పట్టుబడిన స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

చంద్రగిరి, జూలై 9: చంద్రగిరి మండలంలోని శ్రీనివాసమంగాపురం, శ్రీవారిమెట్టు సమీపంలో శేషాచలం అడవుల్లోకి చొరబడుతున్న కొందరు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అడ్డుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి కారు, రంపాలు, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు.. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్‌కుమార్ మంగళవారం కళ్యాణిడ్యామ్ నుంచి శ్రీవారిమెట్టు వైపు కూంబింగ్ చేపట్టారు. నాగపట్ల సెక్షన్ పరిధిలో ఒక కారు నుంచి కొంతమంది వ్యక్తులు దిగారు. వీరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి ఇద్దరిని పట్టుకున్నారు. వీరిని తమిళనాడు వేలూరు జిల్లా ఆనైకట్టుకు చెందిన శక్తివేల్, రాజేంద్రన్ చిన్నపయ్యన్‌లుగా గుర్తించారు. వారిని విచారించగా, తిరుపతి సమీపంలోని అడవుల్లో ఎర్రచందనం చెట్లను నరకడానికి అదే ప్రాంతానికి చెందిన రాజశేఖర్ అనే మేస్త్రీ తమను తీసుకువచ్చినట్లు తెలిపారు. వారి నుంచి కారు, రంపాలు, గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన శెల్వరాజ్, రాజశేఖర్, గోపి, శీను, గోవిందన్‌ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అడవుల్లోని అన్ని ప్రాంతాల్లోనూ స్మగ్లర్ల కోసం జల్లెడ పట్టారు. అరెస్టయిన నిందితులను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకుని వచ్చి కేసు నమోదు చేయగా, సీఐ సురేష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. స్మగ్లర్లు అడవుల్లోకి వెళ్లి చెట్లను నరకకుండా సంరక్షించి, ముందస్తుగానే వీరిని పట్టుకోగలిగామని ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

మహిళలకు అండగా నిలిచింది టీడీపీనే

రామకుప్పం, జూలై 9: తెలుగు రాష్ట్రాల్లో మహిళలకు అండగా నిలిచింది టీడీపీ నేనని ఆ పార్టీ రామకుప్పం మండలం అధ్యక్షుడు ఆనందరెడ్డి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గొరివిమాకులపల్లెలో నిర్వహించిన గ్రామసమాఖ్య సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రబాబు గతంలో మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి సభ్యులందరికీ ఆర్థిక ఆసరా అందించారన్నారు. ప్రస్తుతం మళ్లీ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాసిలెండర్లు, 16 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఆర్థికసాయం అందించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఈ సమవేశంలో నేతలు మహ్మద్‌రఫీ, నందారెడ్డి, వెంకటప్ప, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధన అందించాలి


శిక్షణా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఉపవిద్యాశాఖ అధికారి చంద్రశేఖర్

పలమనేరు, జూలై9 : ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు టీచ్‌టూల్ శిక్షణా కార్యక్రమంలో తెలుసుకొన్న విషయాలు తరగతి గదుల్లో ప్రతిబింబించేలా మెరుగైన బోధన అందించాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం పలమనేరులో జరుగుతున్న 6 మండలాల టీచ్‌టూల్ శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లీలారాణి, మాస్టర్స్ ట్రయినర్స్, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ ఊరేగింపు



గుడుపల్లె, జూలై 9: మండల పరిధిలోని పెద్దబజనవాడలో గంగమ్మ ఊరేగింపు మంగవారం వైభవంగా నిర్వహించారు. పెద్దబజనవాడలో కొలువైన గంగమ్మ ఆలయం వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మ వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. తర్వాత అమ్మవారిని పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం గంగమ్మ ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి డప్పువాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. మహిళలు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు సమీప గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

ఉపాధిలో పండ్లు, పూల సాగుకు ప్రోత్సాహకాలు


ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడీ

గుడుపల్లె, జూలై 9: ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లు, పూల సాగుకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ వెంకటరత్నం తెలిపారు. మంగళవారం గుడుపల్లె ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నకారు రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ఉపాధి హామీ పథకంలో మామిడి, జీడి మామిడి, బత్తాయి, ఆసిడ్ లైమ్, నాటు జామ, తైవాన్ జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, చింత, ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్, గులాబీ, మల్లె, మునగ, ఇతర పూల తోటలను పెంపకం కోసం ప్రోత్సకాలను అందిస్తుందని వివరించారు. రెండు ఎకరాలు ఉన్న రైతులు సంబంధిత గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించి భూమికి సంబంధించిన పత్రాలను అందించి ప్రోత్సాహకాలను పొందాలన్నారు. అలాగే పశువుల గడ్డి కూడా ఒక రైతు ఒక ఎకరంలో నాటుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ధనయ్య, టీఏలు మునిరత్నం, సోమశేఖర్, సుబ్రహ్మణ్యం, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



బైరెడ్డిపల్లె, జూలై 9 : బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భిణులకు మంగళవారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో పౌష్టికాహారాన్ని వైద్యాధికారి డాక్టర్ విజయచందర్ పంపిణీ చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ప్రతినెలా క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని అందజేస్తున్న మహతి ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాలిని, ఆరోగ్య విద్యాధికారి సావిత్రి, మహతి ఫౌండేషన్ ప్రతినిధులు తిమ్మక్క, శాంతమ్మ, బుజ్జి, శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో తరచూ అంధకారం


అంధకారంలో ఉన్న పలమనేరు ఆర్టీసీ బస్టాండు

పలమనేరు, జూలై 9: స్థానిక ఆర్టీసీ బస్టాం డులో రాత్రి వేళల్లో కరెంటు పోతే బస్టాండు మొత్తం అంధ కారం నెలకొంటోంది. పలమనేరు ఆర్టీసీ బస్టాండు దొంగలకు నిలయంగా ఉంది. పట్టపగలే బస్టాండులో దొంగల బారిన పడి మహిళలు, వృద్ధులు నగలు, నగదు పోగొట్టుకొన్న సంఘటనలు అనేకం ఉన్నాయి. కనీసం రాత్రి చివరి బస్సులు వెళ్లే వరకు విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చూడాల్సి ఉంది. అదేసమయంలో ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండులో విద్యుత్ సరఫరా ఆగిపోతే జనరేటర్ ద్వారా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వరసిద్ధుడి ఆలయ అభివృద్ధికి కృషి

ఐరాల(కాణిపాకం), జూలై 9: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీ దగ్గుమళ్లప్రసాదరావును మంగళవారం కాణిపాకానికి చెందిన టీడీపీ నాయకులు కోరారు. ఎంపీని ఆలయ వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ మాజీచైర్మన్ మణినాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు,టీడీపీ నాయకుడు హేమాద్రినాయుడు పాల్గొన్నారు.

అమరావతికి రూ.45వేల విరాళం

శ్రీరంగరాజపురం, జూలై 9: రాజధాని అమరావతి నిర్మాణానికి పుల్లూరు గ్రామ పంచాయతీకి చెందిన మహిళా సంఘాలు రూ. 45వేలు విరాళంగా అందించాయి. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో సీసీ మునేంద్రకు అందించారు. మైనారిటీ నాయకుడు మహ్మబూబ్ బాషా, పుల్లూరుబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బాలాజీ, దామోదరం, సోమశేఖర్, వెంకటేష్, బన్నీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుప్పం - హైదరాబాద్ బస్సు సర్వీస్ పునరుద్ధరణ

సోమల, జూలై 9: మూడేళ్ల క్రితం ఆగిపోయిన కుప్పం - హైదరాబాద్ బస్సు సర్వీసు పునరుద్ధరణపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుప్పం డిపో నుంచి నడుస్తున్న ఆర్టీసీ సర్వీసు కుప్పంలో సాయంత్రం 3గంటలకు బయలుదేరి పలమనేరు, పుంగనూరు మీదుగా సోమలకు 6.30కు, కలికిరి, రాయచోటి, కడప, నంద్యాల మీదుగా మరుసటి రోజు ఉదయం 6.30కు హైదరాబాద్ చేరుకుంటుంది. తిరిగి హైదరాబాద్‌లో సాయంత్రం 5.30కు బయలు దేరి సోమలకు ఉదయం 6.00గంటలకు, కుప్పం డిపోకు ఉదయం 11గంటలకు చేరుకుంటుంది. ఈ సర్వీసు తిరిగి ప్రారంభంతో పుంగనూరు, చౌడేపల్లె, కలికిరి, కడప వైపు ప్రయాణం సాగించేవారికి ఎంతో అనువుగా ఉండనుంది.

ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి


మాట్లాడుతున్న సీఐ మల్లేష్‌యాదవ్

రామకుప్పం, జూలై 9: విద్యార్థులు విద్యతో బాటూ ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్ కోరారు. మంగళవారం విజలాపురం ధార్మిక్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక కేజీబీ విద్యాలయంలో విద్యార్థులకు ఉచిత కరాటే శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. కరాటేతో ఆత్మరక్షణ మెళకువళతో బాటూ, ఆరోగ్యం, ఏకాగ్రతను పొందవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ధార్మిక్ సేవా సమితి అధ్యక్షుడు మహేష్, కరాటే మాస్టర్ ఏకాంబరం, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కారు బోల్తా..ఇద్దరికి తీవ్ర గాయాలు


సుద్దులకుప్పం క్రాస్ వద్ద చెట్టును ఢీకొన్న కారు

వి.కోట, జూలై : వి.కోట - పేర్నాంబట్ ప్రధాన రహదారిలో సుద్దులకుప్పం క్రాస్ వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు తమిళనాడు వాసులు తీవ్రంగా గాయపడ్డారు. ఉమ్రబాద్‌కు చెందిన సల్మాన్, నియాజ్‌లు వి.కోటకు వచ్చి కారులో తిరుగు ప్రయాణమయ్యారు. అతివేగంగా కారునడుపుతూ వాహనాన్ని అదుపుచేయలేక రోడ్డు పక్క నున్న చెట్టును ఢీకొన్నారు. కారు పూర్తిగా ధ్వంసం కాగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని వి.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కుప్పం వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. వి.కోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యాప్రమాణాలు పెంచాలి : ఆర్జేడీ


కడప ఆర్జేడీ శామ్యూల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పుంగనూరు. జూలై9: విద్యా ప్రమాణాలను పెంచి విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని కడప విద్యాశాఖ ఆర్జేడీ శామ్యూల్ సూచించారు. మంగళవారం కడపలో పుంగనూరు విద్యాధికారులు, ప్రైవేటు పాఠశాలల అధినేతలు ఆయనను కలసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పుంగనూరు రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ పాఠశాల డైరెక్టర్ సీ.చంద్రమోహన్‌రెడ్డి, మదనపల్లె విజయభారతి విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎస్.సేతు, పుంగనూరు మండలం గూడూరుపల్లె ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మహేశ్‌నారాయణ, పలువురు ఎంఈవోలు ప్రభాకర్‌రెడ్డి, రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి, సీటీఎం హెచ్‌ఎం రిషికేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా ఆర్వీటీ బాబు ఎంపిక



పుంగనూరు రూరల్, జూలై 9: పుంగనూరు ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ గౌరవాధ్యక్షుడుగా టీడీపీ నాయకుడు ఆర్వీటీ బాబునును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆర్టీసీ యూనియన్ నాయకులు శంకరయ్య, గిరిప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక డిపోలో ఆర్టీసీ యూనియన్ సంఘ సభ్యులు సమావేశం ఏర్పాటు చేసి ఆర్వీటీ బాబును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం ఆయనను ఆర్టీసీ ఉద్యోగులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు మల్లికార్జున, రెడ్డెప్ప, సాదిక్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా పచ్చిగెరిగె ఊరేగింపు

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం ● జాతరతో కిక్కిరిసిన రామకుప్పం



రామకుప్పం వీధుల్లో ఊరేగుతున్న పచ్చిగెరిగె ● పచ్చిగెరిగెను అనుసరిస్తున్న గంగమ్మ, పోతులరాజు ఉత్సవర్లు

రామకుప్పం, జూలై 9: రామకుప్పం గంగజాతరలో ముఖ్యమట్టమైన పచ్చగెరిగె ఊరేగింపు కోలాహలంగా సాగింది. అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం దిగువవీధి గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు జరిగాయి. ఉదయం 8:30గంటలకు ఆలయ పురోహితులు వేదమంత్రోచ్చరణల మధ్య ఆలయ ఈశాన్య దిక్కున ఏర్పాటు చేసి అగ్నిగుండంలో అగ్ని ప్రజ్వలన చేశారు. 9గంటలకు పట్టణ శివార్లలోని సల్లాపురమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి పచ్చిగెరిగె ఊరేగింపు ప్రారంభమైంది. మంగళవాయిద్యాలు, డప్పుల హోరు మధ్య పచ్చిగెరిగెను గంగమ్మ, పోతులరాజు, సల్లాపురెమ్మ ఉత్సవర్లు అనుసరించాయి. భక్తులు అడుగడుగునా పచ్చిగెరిగెకు పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టి, కర్పూరహారతులిచ్చారు. పలువురు అమ్మవారికి ఒడిబాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు పచ్చిగెరిగెకు పూజలు చేసి జంతుబలులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దిగువవీధి, కుమ్మరవీధి, వైశ్యవీధి, శివాజీనగర్, రెడ్డివీధి, ఎగువబైపాస్‌రోడ్, ఇందిరానగర్‌కాలనీ, కోదండరామనగర్‌కాలనీ, రామనగర్ కాలనీ, మాదిగవాడ, మెయిన్‌బజార్, పోలీస్‌స్టేషనుసర్కిల్, బ్రాహ్మణవీధుల మీదుగా సాగిన పచ్చిగెరిగె ఊరేగింపు రాత్రి 10:30గంటలకు తిరిగి దిగువవీధ గంగమ్మ ఆలయం వద్దకు చేరుకుంది. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం, భక్తుల గోవిందనామస్మరణల మధ్య పచ్చిగెరిగె అగ్నిగుండ ప్రవేశం జరిగింది. అనంతరం పలువురు భక్తులు అగ్నిగుండంలోని నిప్పులపై నడిచి మొక్కులు తీర్చుకున్నారు. జాతరతో రామకుప్పం వీధులన్నీ భక్తులతో సందడిగా మారాయి.

నిత్యం ప్రజల్లో ఉండండి : అమర్


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెద్దపంజాణి, జూలై 9: నాయకులు నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. మంగళవారం పెద్దపంజాణి మండలంలోని గోనుమాకులపల్లెలో 15 పంచాయతీలకు చెందిన తెలుగుదేశం పార్టీ పంచాయతీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా పంచాయతీలలోని నాయకులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి సమస్యలు అడిగి తెలుకున్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ బలహీనంగా ఉన్నచోట కారణాలు కనుక్కుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదేవిదంగా పంచాయతీ, గ్రామస్థాయి నాయకులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కక్షపూరిత రాజకీయాలకు దూరంగా ఉండాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయభాస్కరరెడ్డి, నాయకులు మురహరిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, శ్రీరాములు, ఆనంద, చలపతి, నాగరాజరెడ్డి, సుధాకరరెడ్డి, భానుప్రతాప్‌రెడ్డి, పార్థసారథి, సుబ్రమణ్యంరెడ్డి, రామక్రిష్ణ, రాజారెడ్డి, చెంగారెడ్డి, మోహన్‌రెడ్డి, వేమారెడ్డి, బట్టందొడ్డి రెడ్డెప్ప, నిడిగుంట సుబ్రమణ్యం, మహేంద్రరెడ్డి, వేణుగోపాల్‌నాయుడు, శివాడి నాగరాజ, సొన్నేపల్లెనాగరాజ, గంగప్ప, శంకరప్ప, శ్రీనివాసులు, వరప్రసాద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలో రేడియోహౌస్, డంపింగ్‌యార్డు


రేడియోహౌస్


డ్రిప్ పైపులు వేసి ఉన్న డంపింగ్ యార్డు

పెద్దపంజాణి, జూలై 9: మండలంలో ఓ వైసీపీ నాయకుడు ప్రజల ఆస్తిని సొంత అవస రాలకు వినియోగించుకుంటున్నారు. అధికారులు సైతం ఆయనకు అండగా ఉన్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించింది. వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని చెత్తను సేకరించి వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించి పంచాయతీలకు ఆదాయం చేకూర్చాలని వీటిని ఏర్పాటు చేశారు. తరువాత వచ్చిన వైసీపి ప్రభుత్వం ఈ కేంద్రాలను నిర్వీర్యం చేసింది. ఈ క్రమంలో మండలంలోని ముదరంపల్లె గ్రామ సమీపంలో నిర్మించిన డంపింగ్ యార్డును ఆ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఆక్రమించుకుని తమ సొంత అవసరాలకు వినియోగంచుకుటున్నారు. ఇందులో వ్యవసాయ పరికరాలు, డ్రిప్‌పైపులు, టమోటా కట్టెలు వేసుకున్నాడు. ఈ డంపింగ్ యార్డు అప్పినపల్లె - పలమనేరు రహదారి పక్కనే ఉన్నా, నిత్యం అధికారులు ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. ● అదేవిధంగా గ్రామ నడిబొడ్డున దాదాపు 30 ఏళ్ల క్రితం ప్రభుత్వ నిధులతో రేడియో హౌస్ నిర్మించారు. దీన్ని కొంతకాలం ప్రభుత్వ సమాచార కేంద్రంగా మరికొంత కాలం పంచాయతీ కార్యాలయంగా తర్వాత సచివాలయంగా ఉపయోగించారు. నూతనంగా సచివాలయ భవనం నిర్మించిన తరువాత ఈ భవనాన్ని కూడా తన సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్తులు కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉచిత ఇసుక పాలసీతో పేదింటి కల సాకారం

● చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ శ్రేణుల పాలాభిషేకం



కుప్పం, జూలై 9: ముఖ్యమంత్రి చంద్రబాబు తెచ్చిన ఉచిత ఇసుక పాలసీతో పేదింటి కల సాకారం కానుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్. మునిరత్నం, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. ఉచిత ఇసుక పాలసీ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో కుప్పంలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక మాఫియా ఏకంగా రూ.50 వేల కోట్లకు పైగా ప్రజాధనం కొల్లగొట్టిందని విమర్శించారు. అదేసమయంలో భవన నిర్మాణ రంగం కుదేలై కార్మికులు రోడ్డునపడ్డారన్నారు. ప్రస్తుత ఉచిత ఇసుక పాలసీతో పేదల సొంతింటి కల నెరవేరడం సులభంగా మారుతుందని పేర్కొన్నారు.

● మోడల్ మున్సిపాలిటీగా కుప్పం

కుప్పంను స్మార్ట్ మున్సిపాలిటీగా, పట్టణాన్ని మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. అంతేగాక గ్రామీణ ప్రాంతాలలోని రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి సదుపాయం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికే సమగ్ర ప్రణాళిక తయారైందన్నారు. మేజర్ పంచాయతీకి రూ.2 కోట్లు, మైనర్ పంచాయతీకి రూ.1 కోటి నిధులు కేటాయించి సమగ్రాభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు గోపీనాథ్, సత్యేంద్ర శేఖర్, డాక్టర్ వెంకటేశ్, ఏవీ.రవి, మంజునాథ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో మైథిలి

శాంతిపురం, జూలై 9: మండల పరిధిలోని కెనమాకులపల్లె, సొన్నేగానిపల్లె పంచా యతీల్లోని గ్రామాల్లో మంగళ వారం ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండడంతో అధికారులు పారి శుధ్యం పై దృష్టిసారించారు. ఈ క్రమంలో ఎంపీడీవో మైథిలి గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆ మేరకు పంచాయతీ అధికారులు పర్యవేక్షణలో ముమ్మరంగా పారిశుధ్య పనులు రెండు రోజులుగా చేపడుతున్నారు. ఇందులోభాగంగా గుండిశెట్టిపల్లెలో పారిశుధ్య పనులను ఎంపీడీవో పరిశీలించారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తలను తొలగించి బ్లీచింగ్ చల్లలంచారు. చెత్త దిబ్బలను, ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను దగ్గరుండి తీయించారు.

'స్మార్ట్ కుప్పం' ప్రక్రియ షురూ!

● నియోజకవర్గ అధికారులతో సమావేశమైన ప్రత్యేక అధికారులు



కుప్పం, జూలై 9: స్మార్ట్ కుప్పంగా కుప్పం మున్సిపాలిటీని తీర్చిదిద్దడానికి సీఆర్డీయేకి చెందిన ఏపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ అధికారుల బృందం రెండు రోజుల నుంచి కుప్పంలో పర్యటిస్తోంది. సోమవారం క్షేత్ర స్థాయి పర్యటన పూర్తి చేసుకుని జేసీ పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించిన అధికారులు, మంగళవారం ఆర్డీవో శ్రీనివాసులు పర్యవేక్షణలో స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నియోకవర్గ స్థాయిలోని వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. రోడ్లు, కాలువలు, ట్రాఫిక్, శ్మశానాలు, ఎన్టీఆర్ సుజల స్రవంతి, ఉద్యానవనాలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆయా అంశాలకు సంబంధించిన సమగ్ర నివేదికను కోరారు. అయితే వైసీపీ అయిదేళ్ల పాలనలో అధికార యంత్రాంగం నిర్లక్ష్య ధోరణి కారణంగా ఏ అంశాలకు సంబంధించి కూడా ఒక్క శాఖ వద్దా సమగ్ర సమాచారం దొరకలేదు. రూ.66 కోట్లు కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి మంజూరు అయినా ఆ నిధులను ఎప్పుడు ఎక్కడ ఖర్చు పెట్టారు? ఏయే పనులు పూర్తయ్యాయి. ఇంకా ఎన్ని అసం పూర్తిగా ఉన్నాయి. బిల్లుల చెల్లింపు వంటి వివరాలు అధికారులు చెప్పలేకపోయారు. దీంతో ఒకింత అసహనం వ్యక్తం చేసిన ఉన్నతస్థాయి అధికారుల బృందం, అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమగ్ర నివేదికను తయారు చేసి తమకు అందిం చాలని కోరింది. ఆయా వివరాలు క్షుణ్ణంగా పరిశీ లించిన అనంతరం మాస్టర్ ప్లాన్ తయారు చేయడానికి వీలవుతుందని బృందంలోని అధికారులు చెప్పారు. ముఖ్య మంత్రి చంద్రబాబు కుప్పం మున్సిపాలిటీతోపాటు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి పట్ల నిబద్ధతతో ఉన్నారని అయన అడిగిన మేరకు అభివృద్ధి జరగాలంటే, అధికారులు తమకు సంపూర్ణంగా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్డీవో జి.శ్రీనివాసులు, తహసీల్దారు హరిబాబు, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సోమల ఎస్ఐగా శివశంకర్

సోమల, జూలై 9: సోమల ఎస్ఐగా శివశంకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ వెంకట నరసింహులును పలమనేరుకు బదిలీ చేశారు.

సాయిబాబా ఆలయానికి విరాళాలు

సోమల, జూలై 9: సోమల సాయినగర్‌లో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో ఈ నెల 21న గురు పౌర్ణమి ఉత్సవాల నిర్వహణకు పలువురు దాతలు విరాళాలు అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తిరుపతికి చెందిన పుష్పలత, సిద్ధయ్య దంపతులు రూ. 10 వేలు, మునివెంకటప్ప దంపతులు రూ. 5వేలు, గన్నాలక్ష్మయ్య దంపతులు రూ.5వేలు, శింగంశెట్టి శంకరయ్య రూ. 5వేలు, మరికొందరు వెయ్యి వంతున విరాళాలు అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ద్విచక్రవాహనం బోల్తా యువకుడికి గాయాలు

సోమల, జూలై 9: మేటిమంద - కందూరు మార్గంలోని చింతల వారిపల్లె మలుపులో ద్విచక్రవాహనం బోల్తా పడి యువకుడు గాయపడ్డాడు. అన్నమయ్య జిల్లా మహల్‌కు చెందిన రఫీ చౌడేపల్లె నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా చింతల వారిపల్లె మలుపులో బొలెరో ఎదురుగా రావడంతో రఫీ సడన్ బ్రేక్ వేయడంతో అదుపు తప్పి పడిపోయాడు. సమీప పొలంలోని రైతులు అతడిని కందూరు వైద్యశాలకు తరలించారు.

వడ్డిపల్లెలో గంగమ్మ జాతర వేడుకలు

సోమల, జూలై 9: సోమల మండలంల వడ్డిపల్లెలో మంగళవారం గంగమ్మజాతర వేడుకలు ప్రారంభ మయ్యాయి. పాయలవారిపల్లె, రాశెట్టివారిపల్లె, భారతం మిట్ట, వడ్డిపల్లెలోని పొలిమేర అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. రాశెట్టివారిపల్లెలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. పలు గ్రామాల మహిళలు బోనాలు సమర్పించారు. అమ్మవార్లకు పిండి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

పుంగనూరులో రెండు చోట్ల చోరీలు

పుంగనూరు రూరల్, జూలై9: పుంగనూరులో సోమవారం రాత్రి ఒక ఇంటితోపాటు మరో హోటల్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానిక ప్రైవేటుబస్టాండ్ సమీపంలోని శంకర్‌నాయక్ హోటల్‌లో ఒక సిలిండర్, రూ.2వేలు నగదు, మిక్సీలు చోరీచేశారు. ● మదనపల్లె మార్గంలోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ యజమాని ఇంట్లో వెండి వస్తువులు, కంప్యూటర్ తీసుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హెల్మెట్ ధరించకుంటే చర్యలు తప్పవు


ద్విచక్రవాహన దారులకు జరిమాన విధిస్తున్న సీఐ

చౌడేపల్లె, జూన్9: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే కఠిన చర్యలు తప్పవని పుంగనూరు రూరల్ సీఐ కృష్ణరెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన మండలంలోని పక్షిరాజపురం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



హోం మంత్రి అనితకు షీల్డు అందిస్తున్న వినాయకం

చిత్తూరు (సెంట్రల్), జూలై 9: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం హోం మంత్రి వంగలపూడి అనితకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం అమరావతి సెక్రటేరియేట్‌లో ఆమెను కలిసి పలు సమస్యలు వివరించారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీ ఏర్పడిన ఎస్సీ, ఎస్టీలకు బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, పూర్తి రక్షణ కల్పించాలని, సంఘం కార్యకలాపాలకు అవసరమైన భవన నిర్మాణానికి రాజధానిలో స్థలం కేటాయించాలని కోరారు. మంత్రికి వినతి పత్రం సమర్పించిన వారిలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ప్రభావతి, రాష్ట్ర కార్యదర్శి రంగయ్య, చినరాజు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి రాణించాలి



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

చిత్తూరు (సెంట్రల్), జూలై 9: విద్యార్థులు చదువుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని పీవీకేఎన్ ప్రిన్సిపల్ జీవనజ్యోతి పేర్కొన్నారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్ నాల్గవ సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు మంగళవారం ఉన్నత విద్యా మండలి గుర్తింపు ధ్రువీకరణ పత్రాలను కళాశాలలో అందజేశారు. ఇలాంటి శిక్షణ పొందడం ద్వారా నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకునే వీలుందన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ అప్లికేషన్ అధ్యాపకులు శరవణ, నాక్ కోఆర్డినేటర్ హరిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ మీరా సాహెబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

117 జీవో రద్దుకు చర్యలు చేపట్టాలి : ఆపస్

చిత్తూరు (సెంట్రల్), జూలై 9: విద్యా రంగానికి తీవ్ర నష్టం కలుగజేస్తున్న 117 జీవోను రద్దు చేయాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణలు విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జీవో కారణంగా నాలుగు, ఐదు తరగతులు విలీనం ద్వారా విద్యా వ్యవస్థ అన్ని రకాలుగా నష్టపోతుందన్నారు. హైస్కూల్ ప్లస్‌లకు రెగ్యులర్ అధ్యాపకులను నియమించడంతో పాటు ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈనెల 16న నిర్వహించే మంత్రి వర్గ సమావేశంలో జీవో రద్దుపై కీలక నిర్ణయం తీసుకోవాలని కోరారు.

డెంగ్యూ నియంత్రణకు అవగాహన ర్యాలీ



తవణంపల్లె, జూలై 9: డెంగ్యూ, అతిసార నియంత్రణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటినే తాగాలని, డ్రై డేను విధిగా పాటించాలని, దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, కలుషిత నీరు, ఆహారం అతిసారాలకు మూలమన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు ప్రియాంక, మోహనవేలు, వినయ్‌కుమార్, సీహెచ్‌వో సుబ్రమణ్యం, సూపర్‌వైజర్లు రాజశేఖర్‌రెడ్డి, రెడ్డెమ్మ, నిర్మల, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రీచ్ లేని చోట ఇసుక తరలిస్తే కఠినచర్యలు

గంగాధరనెల్లూరు, జూలై 9: మండలంలో ఇసుకరీచ్‌లు ఏర్పాటు చేయనందున ఇసుక అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తీసుకొంటామని తహసీల్దార్ రవి హెచ్చరించారు. నీవానది యేటికి పక్కన కొట్రకోన, కలిజవేడు, ముక్కళత్తూరు, వేల్కూరు రెవిన్యూ గ్రామాలవద్ద ఇసుక ఉందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఈ మండలానికి రీచ్‌లు మంజూరు చేయలేదని స్పష్టం చేశారు. ఇక్కడ ఇసుకను తరలిస్తే ట్రాక్టర్‌కు రూ.50వేలు, జేసీబీ(ఎక్సకవేటర్)కి రూ. లక్ష జరిమానా విధించి వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

విజయంలో ఇన్వెస్టిట్యూర్ వేడుకలు



మాట్లాడుతున్న విజయం అకడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి

చిత్తూరు (సెంట్రల్), జూలై 9: స్థానిక సుందరాజపురం విజయం సీబీఎస్ఈ పాఠశాలలో విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి అధ్యక్షతన మంగళవారం ఇన్వెస్టిట్యూర్ (పెట్టుబడి) వేడుకలు నిర్వహించారు. ఓటింగ్ ద్వారా ఎంపికైన పాఠశాల క్యాబినెట్ సభ్యులు హెడ్ బాయ్, గర్ల్, స్పోర్ట్స్ కెప్టెన్, తదితరులకు స్లాగ్ రిబ్బన్లు ప్రదానం చేశారు. వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి మాట్లాడారు.యాజమాన్యం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హెచ్ఎం కౌలస్య, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే ఇసుక ఉచితం

వెదురుకుప్పం, జూలై 9: పేదల సొంతింటి కల నెరవేరడానికి సీఎం చంద్రబాబు ఇసుక ఉచితం చేశారని స్థానిక టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి తెలిపారు. మంగళవారం వెదురుకుప్పంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఇసుక కోసం సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. చంద్రబాబు హామీ మేరకు ఉచిత పాలసీని అమలులోకి తెచ్చారన్నారు. దీనివల్ల ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

బస్ ఢీకొని ఒకరు దుర్మరణం



మృతి చెందిన పద్మనాభరెడ్డి

గంగాధరనెల్లూరు, జూలై 9: వేపంజేరి సమీపంలో కర్ణాటక ఆర్‌టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం వేపంజేరి పంచాయతీ ముసలయ్యగారిపల్లెకు చెందిన పద్మనాభరెడ్డి (55) తమలపాకుల కట్టను చిత్తూరులో అమ్మేసి బైకుపై తిరిగి వస్తుండగా వేపంజేరికి సమీపంలో బలిజకండ్రిగ నుంచి బెంగళూరుకు వస్తున్న కర్ణాటక ఆర్‌టీసీ బస్సు ఢీకొంది. పద్మనాభరెడ్డి తలకు తీవ్ర రక్తస్రావమైంది. అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, మృతుని కుటుంబ సభ్యులు గంగాధరనెల్లూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీని కలిసిన కమిషనర్

చిత్తూరు, జూలై 9: ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం చిత్తూరులోని ఎంపీ కార్యాలయంలో ఆయన్ను నగరపాలక ఉద్యోగులతో కలిసి మొక్కను అందించారు. అభినందనలు తెలిపారు. నగరాభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ఈ ఏసీ రామకృష్ణుడు, మేనేజర్ గోపాలకృష్ణవర్మ, పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ-1 డిపోలో డయల్ యువర్ డీఎం

చిత్తూరు రూరల్ జూలై 9: చిత్తూరు ఆర్టీసీ-1 డిపోలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం క్రిష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 1-డిపో పరిధిలో సమస్యలపై ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు, ఫిర్యాదు చేయవచ్చునన్నారు. 9959225674 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

12న ప్రజా వేదిక కార్యక్రమం

వెదురుకుప్పం, జూలై 9: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఈ నెల 12న ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఎంపీడీవో వరప్రసాద్, ఏపీవో ఇందు మంగళవారం ఈ విషయం తెలిపారు.

హిందీ పండిట్ ఆత్మహత్య

చిత్తూరు, జూలై 9: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన హిందీ పండిట్ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. రెండో పట్టణ ఎస్ఐ ప్రసాద్ వివరాల మేరకు.... గిరింపేట ప్రభుత్వ పాఠశాల హిందీ పండిట్ షరీఫ్ సహ ఉపాధ్యాయురాలి పట్ల అమర్యాదగా ప్రవర్తించారని అధికారులు సోమవారం మందలించారు. దీంతో ఆయన మనోవేదనకు గురయ్యారు. పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వేలూరు సీఎంపీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు.

ఆర్టీవో కార్యాలయం సందర్శన

చిత్తూరు సిటీ, జూలై 9: ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మంగళవారం డీటీసీ కార్యాలయాన్ని పరిశీలించారు. డీటీసీ నిరంజన్ రెడ్డి, ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి ఘనస్వాగతం పలికారు. ఎంవీఐలు రాజేశ్వర రావు, నరసింహులు, దీపిక, గాయత్రి, ఏఎంవీఐలు హరికృష్ణ, శివకుమార్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు త్యాగరాజన్, ఆర్ గాంధీ, రాము నీరజాక్షులు నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావును డీటీసీ నిరంజన్ రెడ్డి, ఎంవీఐ రాజేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు ఎంపీడీవో ఆఫీస్‌లో అర్జీల స్వీకరణ

కార్వేటినగరం, జూలై 9: స్థానిక ఎంపీడీవో ఆఫీస్‌లో బుధవారం ఉదయం ఉదయం ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం జరగనుంది. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ హాజరై అర్జీలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆఫీస్ పరిసరాలను పరిశుభ్రం చేశారు.

ఉపాధి హామీ లక్ష్యాలు పూర్తిచేయాలి

● అధికారుల సమీక్షలో కలెక్టర్ సుమిత్ కుమార్



ఉపాధి హామీ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 9: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనిదినాల లక్ష్యాలను పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఉపాధి హామీ పనులపై క్లస్టర్ల వారీగా ఏపీడీ, ఏపీవోలతో సమీక్ష జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు వంద రోజుల పనిదినాలు పూర్తిచేయాలన్నారు. జిల్లాలో మామిడి పెంపకం పట్ల రైతాంగం ఎక్కువ మక్కువ చూపిస్తున్నందున మామిడి మొక్కల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో భాగంగా మండలస్థాయిలో ఉద్యాన, ఉపాధి హామీ అధికారులు సంయుక్తంగా స్థానిక నర్సరీలను తనిఖీ చేసి, సంతృప్తి పొందాకే మొక్కలను వినియోగానికి చర్యలు చేపట్టాలన్నారు. డ్వామా పీడీ రాజశేఖర్ మాట్లాడుతూ జూలై నెలాఖరు వరకు 40లక్షల పనిదినాల లక్ష్యం కాగా ఇప్పటివరకు 26.43 లక్షల పనిదినాలు కల్పించామన్నారు.

ఎంపీ దగ్గుమళ్లను కలిసిన టీడీపీనేతలు



గంగాధరనెల్లూరు, జూలై 9: ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును చిత్తూరులో నియోజకవర్గానికి చెందిన టీడీపీనేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానం చేశారు. పార్లమెంట్ టీడీపీ టీఎన్‌టీయుసీ అధికార ప్రతినిధి జీవరత్నం, కమ్మకండిగ గ్రామ కమిటీ పార్టీ అధ్యక్షుడు వెంకటేశులునాయుడు, గంగమ్మగుడి కమిటీ టీడీపీ ప్రధానకార్యదర్శి రవి పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు ఇన్‌ఛార్జి సీఐగా లక్ష్మన్న

గంగాధరనెల్లూరు, జూలై 9: ఇన్‌చార్జి సీఐగా లక్ష్మన్నకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు జిల్లా పోలీస్ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఇక్కడి సీఐ .శంకర్ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎస్ఐగా పని చేశారు. అప్పట్లో పగిడ్యాల మండల ఘణపురానికి చెందిన నరేంద్రరెడ్డిని ఈయన కొట్టినట్లు కోర్టులో ప్రయివేట్ కేసు నమోదైంది. ఈ కేసులో శంకర్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ గతనెలలో తీర్పు వెలువడిన విషయం తెలిసిందే. దీంతో చిత్తూరు మహిళా పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐ లక్ష్మన్నకు గంగాధరనెల్లూరు స్టేషన్‌లో అదనపు బాధ్యతలు అప్పగించారు.

శ్మశానవాటికలో సౌకర్యాల కల్పనకు చర్యలు

చిత్తూరు, జూలై 9: ఎం.అగ్రహారం శ్మశానవాటికలో మెరుగైన సౌకర్యాల కల్పించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన నేతలు, అధికారులతోకలిసి ఈ శ్మశానవాటికను పరిశీలించారు. ప్రహరిగోడ నిర్మాణం, ఇతర సౌకర్యాల కల్పనకు నివేదికను సిద్ధం చేయాలని కమిషనర్ అరుణను ఆదేశించారు. అంతకుముందు ఎం. అగ్రహారం పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. క్రీడామైదానాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుత్తణి వరకు సర్వీసు రోడ్డు నిర్మించాలి



పీడీకి విన్నవిస్తున్న గ్రామస్తులు

విజయపురం, జూలై 9: చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారి పక్కన తిరుత్తణి నుంచి బూచివానత్తం వరకు సర్వీసు రోడ్డు నిర్మించాలని ఎన్‌హెచ్ పీడీ కార్తీక్‌ను గ్రామస్తులు మంగళవారం కోరారు. బూచివానత్తం నుంచి ఎక్కువ మంది రైతులు పొలాలు జాతీయ రహదారికి ఇచ్చారన్నారు. తమ గ్రామం నుంచి రోడ్డుకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. వర్షాకాలంలో గ్రామానికే పరిమితమవుతున్నామన్నారు. తక్షణమే రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. పీడీ సానుకూలంగా స్పందించినట్టు గ్రామస్తులు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు చేయించుకోవాలి

గుడిపాల, జూలై 9: గర్భిణులు ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు చేయించుకోవాలని వైద్యాధికారి సంధ్య అన్నారు. మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గర్భిణులకు ఏడు రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సూచనలు ఇచ్చారు. ఆరోగ్య కేంద్రంలో 24 గంటలూ సేవలుంటాయన్నారు. కాన్పులను కచ్చితంగా ప్రభుత్వాస్పత్రుల్లోనే చేయించుకోవాలన్నారు. వైద్యాధికారి మహేష్, వైద్య సిబ్బంది విజయ, వెంకటేష్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

పాలసముద్రం, జూలై 9: గర్భిణులు పౌష్టికాహారం తీసుకొని క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ క్రిష్ణమోహన్ పేర్కొన్నారు. మంగళవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 60 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 24 మందిని హైరిస్క్ కేసులుగా గుర్తించారు. వారికి ప్రత్యేకంగా మందులు అందజేశారు. వారు తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను విరివిగా ఉపయోగించాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు చేయించుకోవాలని సూచించారు. సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, సుశీల, ఏఎన్ఎంలు అరుణ, రేవతి, లక్ష్మి, కమల, గంగ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే థామస్ పూజలు



జాతరలో మాట్లాడుతున్న థామస్

వెదురుకుప్పం, జూలై 9: దిగువపల్లాలు పంచాయతీ ఆళ్లమడుగు కాలనీలో మంగళవారం రాత్రి జరిగిన తురకాణమ్మ గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ మంగళవారం రాత్రి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ శ్రేణులు, గ్రామ పెద్దలు స్వాగతం పలికారు. అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. థామస్ మాట్లాడుతూ అందరూ కలసి మెలసి జాతర తిరుణాళ్లను జరుపుకోవడం హర్షనీయమన్నారు. మోహన్‌మురళి, బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మరకాలకుప్పం సుధాకర్ పాల్గొన్నారు.

మహిళలు బలమైన శక్తిగా ఎదగాలి

గుడిపాల, జూలై 9: మహిళలు బలమైన శక్తిగా ఎదగాలని ఏపీఎం సుధారాణి అన్నారు. మంగళవారం ఆమె రామభద్రాపురంలో మహిళాసంఘాల సభ్యుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యుల పొదుపు, రుణాలు, గ్రూపు లీడర్ల మార్పు-చేర్పులపై సూచనలిచ్చారు.. సర్పంచ్ హరిణి హేమాద్రినాయుడు, సంఘమిత్ర పుష్ప, డ్వాక్రా సంఘాల సభ్యురాండ్రు తదితరులు పాల్గొన్నారు.

షిఫ్ట్ ఆపరేటర్లు అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు రూరల్, జూలై 9: సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్లు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎం అండ్‌పీ ఈఈ రవికుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక గిరింపేటలోని ట్రాన్స్‌కో అతిథి గృహంలో షిఫ్ట్ ఆపరేటర్లకు శిక్షణా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షిఫ్టులో ముఖ్యమైన ఆపరేషన్స్ అడిగి తెలుసుకోవాలన్నారు. సెల్ మాట్లాడుతూ ఓ.ఎల్.టీ.సీ ఆపరేట్ చేయకూడదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్స్ ఈఈ మహేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ ప్రొటెక్షన్ సతీష్, డీఈలు శేషాద్రి, పద్మనాభపిళ్లై, ఏఈ వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసులో ఏడాదిన్నర జైలు

చిత్తూరు లీగల్, జూలై 9: ఎస్సీఎస్టీ ఎట్రాసిటీ కేసులో ఒకరికి ఏడాదిన్నర జైలుశిక్ష విధించారు. బంగారుపాళ్యం మండలం నలగాంపల్లికి చెందిన ఓ మహిళను 2014లో అదే గ్రామానికి చెందిన మధు కులంపేరుతో దూషించారనే కేసును మంగళవారం ఒకటవ అదనపు జిల్లా కోర్టులో న్యాయమూర్తి రమేష్ విచారించారు. ముద్దాయికి ఏడాదిన్నర జైలుశిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ట్రాక్టర్ డ్రైవరుకు ఏడాది జైలు

విజయపురం, జూలై 9: కాళికాపురం వద్ద రెండేళ్ల క్రితం ఒకరి మృతికి కారణమైన కేసులో ట్రాక్టరు డ్రైవర్ కిరణ్‌కు కోర్టు మంగళవారం రెండున్నరేళ్ల జైలు శిక్ష విధించింది. అలాగే ట్రాక్టరు యజమాని దామోదరానికి మూడు నెలలు జైలు శిక్ష విధిస్తూ నగరి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ విష్ణువర్మ తీర్పు ఇచ్చినట్టు ఎస్ఐ జయప్ప తెలిపారు. ఏపీపీ రామశాంతి వ్యవహరించారు.

ఏటీఎం చోరీ నిందితుల కోసం గాలింపు

గుడిపాల, జూలై 9: గుడిపాలలో రెండు రోజుల క్రితం జరిగిన ఏటీఎం దోపిడీ సంఘటనలో దుండగుల కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు వెస్ట్ సీఐ రవి శంకర్ రెడ్డి నాలుగు బృందాలతో గాలింపు విస్తృతం చేశారు. దుండగులను పట్టుకునేందుకు బెంగళూరు కూడా వెళ్లారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి: జిల్లా జడ్జి



మాట్లాడుతున్న భీమారావు

చిత్తూరు లీగల్, జూలై 9: ద్విచక్రవాహనాల్లో వెళ్ళే ప్రతిఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు సూచించారు. మంగళవారం ఆయన జిల్లాకోర్టు ప్రాంగణంలో హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమన్నారు. హెల్మెట్ ధరించని వ్యక్తులు కుటుంబం గురించి ఆలోచించుకోవాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక వున్న వ్యక్తులు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు..గత ఏడాది నమోదైన 3042 రోడ్డు ప్రమాదాల కేసుల్లో హెల్మెట్ ధరించని వ్యక్తులే అధికంగా ఉన్నారన్నారు. రాజేంద్రరెడ్డితో పాటు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎస్‌డీ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కార్మికుల ధర్నా

చిత్తూరు సిటీ, జూలై 9: చీటికీ మాటికీ కేసులు రాస్తే నేషనల్ హైవే పనులు ఎలా చేస్తామని ఎస్‌డీ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కార్మికులు ప్రశ్నించారు. మంగళవారం సంస్థ కార్మికులు జిల్లా ఉపరవాణా శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అన్ని పత్రాలున్నా ఏదో కారణంతో ఎజ్ చేసి మానసికంగా వేధిస్తున్నారని చెప్పారు. ఆర్టీవో సునీల్ కుమార్ కార్మికులతో మాట్లాడి సర్దుబాటు చేశారు.

వరసిద్ధుడి ఆలయ అభివృద్ధికి కృషి

ఐరాల(కాణిపాకం), జూలై 9: కాణిపాక ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును మంగళవారం కాణిపాకానికి చెందిన టీడీపీ నాయకులు కోరారు. మంగళవారం ఎంపీని వేదపండితులు ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ మాజీఛైర్మన్ మణినాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు,హేమాద్రినాయుడు పాల్గొన్నారు.

9 సవర్ల బంగారం, నగదు చోరీ

తవణంపల్లె, జూలై 9: పత్రపల్లెలో పట్టపగలు చోరీ జరిగింది. ఎస్ఐ అనిల్‌కుమార్ కథనం మేరకు పత్రపల్లెకు చెందిన ఎ.గురప్ప సోమవారం ఇంటికి తాళాలు వేసి భార్యతో కలిసి పొలానికి వెళ్లారు. సాయంత్రం వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించారు. దుండగులు బీరువా తాళాలు పగలగొట్టి 9 సవర్ల బంగారు, కొంత నగదును తీసుకుపోయారు. బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అమరావతికి రూ.45వేల విరాళం

శ్రీరంగరాజపురం, జూలై 9: రాజధాని అమరావతి నిర్మాణానికి పుల్లూరు గ్రామ పంచాయతీకి చెందిన మహిళా సంఘాలు రూ. 45వేలు విరాళంగా అందించాయి. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో సీసీ మునేంద్రకు అందించారు.

మానవత్వం చాటుకున్న ముస్లిం జేఏసీ

బంగారుపాళ్యం, జూలై 9: మొగిలి సమీపంలోని చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారిలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి ముస్లిం జేఏసీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ అహ్మద్ ఆధ్వర్యంలో మంగళవారం దహన సంస్కారాలు నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రిలో మూడు రోజులుగా మార్చురీలో భద్రపరిచినా ఎవరూ రాకపోవడంతో అంత్యక్రియలకు ముస్లిం జేఏసీ బృందం ముందుకొచ్చింది.

సత్యసాయి సేవాసమితి అన్నదానం

చిత్తూరు కల్చరల్, జూలై 9: నగరం వివిధ ప్రాంతాల్లో మంగళవారం సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు పేదలకు అన్నదానం చేశారు. స్థానిక ప్రభుత్వసుపత్రి, గాంధీ సెంటర్, లెప్రసీ వార్డు, చర్చివీధి, పాతబస్టాండుల్లో దాదాపు 300 మంది పేదలకు అన్నం పొట్లాలు, తాగునీరు ప్యాకెట్లను అందజేశారు.

నిర్మాణ రంగాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

చిత్తూరు సిటీ, జూలై 9: నిర్మాణ రంగాన్ని అభివృద్ధి చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్మమని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీ విధానం అమలుతో భవన నిర్మాణ యజమానులు, కాంట్రాక్టర్లు, కార్మికులు, వ్యాపారులు ఆనందంగా ఉన్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సుమారు రూ.50 వేల కోట్ల ఇసుక అక్రమ వ్యాపారం జరిగిందన్నారు. , వైసీపీ నేతలు ప్రభుత్వ ఆదాయాన్ని దండుకున్నారని ఆరోపించారు.. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించి ఆ రంగానికి పూర్వవైభవం తీసుకువస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఉచిత ఇసుక విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు గాంధీ, త్యాగరాజన్, మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



గుడిపాల, జూలై 9: మండల కేంద్రంలోని అన్న క్యాంటీన్‌లో మంగళవారం అన్నదానానికి మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు భోజన వితరణ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు కిట్టు, దొరబాబు, శివలింగా రెడ్డి, ఆనంద్ యాదవ్, రవి, బొడెబ్బ నాయుడు, పుణ్యకోటి, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు న్యాయం చేస్తాం: గురజాల



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు, జూలై 9: పూనేపల్లె వద్ద నిర్మించిన టిడ్కో గృహాల లబ్ధిదారులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. మంగళవారం ఆయన మేయర్ అముదతో కలిసి టిడ్కో గృహాలను సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. పెండింగ్ పనులపై టిడ్కో అధికారులతో చర్చించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, కార్పొరేటర్లు, ఇతర నేతలు అధికారులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

చిత్తూరు (సెంట్రల్), జూలై 9: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆవిర్భావ వేడుకలు మంగళవారం నగరంలో నిర్వహించారు. విద్యార్థుల ర్యాలీని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. వివేకానంద విగ్రహం నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు శ్రీ వివేకానందుడిని ఆదర్శంగా తీసుకుని నేటి తరానికి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు రాఘవేంద్ర మాట్లాడుతూ తమ సంఘం 75 సంవత్సరాలుగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తోందన్నారు. ఏబీవీపీ నాయకులు స్రవంత్, రిషి, అయ్యప్ప, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.